ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025
5
అనంతపురం

సెమినార్‌ను ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

ఔషధ నిరోధకతపై అవగాహన అవసరం

మైక్రోబయాలజిస్టుల పాత్ర కీలకం
సదస్సులో వైద్యరంగ నిపుణులు

ప్రజాశక్తి-అనంతపురం

ఔషద నిరోధకతపై అవగాహన అవసరం అని, ఇందులో మైక్రోబయాలిజిస్టుల పాత్ర అత్యంత కీలకం అని పలువురు వైద్యరంగ నిపుణులు పేర్కొన్నారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల సుశ్రుత సెమినార్ హాల్లో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రాయలసీమ జోన్ మైక్రో బయాలజీ జోనల్ నిరంతర వైద్య విద్యా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అనంతపురం జిల్లాల నుంచి సుమారు 98 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఔషధ నిరోధకత తగ్గించడంలో మైక్రో బయాలజీలోని ఔషధ నిర్ధారణ పరీక్షల్లో సాంప్రదాయ, యంత్రాల పద్ధతులపై ఇందులో చర్చజరిగింది. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తెలుగు మధుసూదన్, మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శాంతి రెడ్డి, రాయలసీమ మైక్రో బయాలజీ సిఎంఈ జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, సిఎంఈ అబ్జర్వర్ డాక్టర్ సరళ, డాక్టర్ పద్మ శ్రావణి తదితరులు మాట్లాడారు. మైక్రోబయాలజిస్టులు ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్ (సాక్ష్యం ఆధారంగా నిర్దేశిత మందు)ను తెలియజేస్తారన్నారు. డాక్టర్ సలహా మేరకు కాకుండా సొంతంగా మందులను వినియోగించడం సరికాదన్నారు. డాక్టర్ సూచించకుండా మందులను అమ్మడం, వాడమన్నంత మోతాదులో మందులను వాడకపోవడం ఔషధ నిరోధకతకు (డ్రగ్ రెసిస్టెన్స్)కు కారణమన్నారు. డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతనే వ్యాధిగ్రస్తుడు మందులను తగిన మోతాదులో వాడాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షకులు, వైద్యులు పద్మ శ్రావణి, హైమావతి, వేముల సరోజ, మీనిగ శైలజ, డాక్టర్ ఉమాదేవి, బసిరెడ్డి ప్రవీణారెడ్డి, ప్రియాంక పుదూర్, లలిత భవాని, దివ్య, కృష్ణవేణి, ఎల్లం నాయుడు పలు విషయాలను తెలియజేశారు. అనంత వైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు భారతదేశంలో మందులు వాడకంపై ప్రదర్శించిన లఘు నాటిక అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో సీనియర్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ గుండెల స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో లాటరీ నిర్వహిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

బార్లకు ముగిసిన లాటరీ

ప్రజాశక్తి-అనంతపురం

బార్ లైసెన్సుల మంజూరుకు లాటరీ పద్ధతిలో శనివారం నాడు కేటాయింపులు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఈ ప్రక్రియ పూర్తయింది. కల్లుగీత కార్మికుల రిజర్వుతో కలిపి మొత్తం 23 బార్లకు రెండు జిల్లాలోనూ కలిపి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో సత్యసాయి జిల్లాలో నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తు రాకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయి. తక్కిన అన్ని బార్లకు లాటరీ పద్ధతిలో కేటాయింపులు జరిగాయి.

అనంతపురం జిల్లాలో అన్నీ పూర్తి

అనంతపురం జిల్లాలో పది బార్లు నాన్ రిజర్వులో ఉండగా రెండు బార్లు కల్లుగీత కార్మికుల రిజర్వేషన్ కింద కేటాయించారు. 12 బార్లకు మొత్తం 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మద్దయ్య ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియను నిర్వహించారు. వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ పద్ధతిలో డ్రా తీసి బార్లకు లైసెన్సులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, ఎఇఎస్ రేవతిలు డ్రా తీశారు. పేర్లు వచ్చిన వారికి అసిస్టెంట్ కలెక్టర్ మంజూరు పత్రాలను అందజేశారు.

సత్యసాయి జిల్లాలో ఏడు బార్లకు లైసెన్స్ మంజూరు

సత్యసాయి జిల్లాలో పది బార్లు అన్ రిజర్వులో ఉండగా ఒకటి కల్లుగీత కార్మిల రిజర్వులో ఉంది. మొత్తం 11 బార్లకు లైసెన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో ఏడు బార్లకు లాటరీ పద్ధతిలో లైసెన్సు మంజూరుకు జిల్లా కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో కేటాయింపులు చేశారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన నాలుగింటికి కేటాయింపులు జరగలేదు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, ఎఇఎస్ బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక నిమజ్జనం

- అనంతలో పోలీసుల భద్రతా ఏర్పాట్లు
- మూడు ప్రాంతాల్లో నిమజ్జనం
- తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్. ఎస్పీ సూచన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో ఆదివారం నాడు వినాయక నిజ్జనం జరుగనుంది. నగరంలో వందల సంఖ్యలో చిన్న, పెద్ద విగ్రహాలు ఏర్పాటై ఉన్నాయి. వీటి నిమజ్జనం ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జగదీశ్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒక ప్రకటన విడుదల చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసకోకుండా ఉండేందుకు సిసి కెమోరాలు, డ్రోన్లను నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ జగదీశ్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎక్కడా పెద్ద శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జ శోభా యాత్ర జరిగే విధంగా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇద్దరు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

మూడు ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు

మూడు ప్రాంతాల్లో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. పెద్ద విగ్రహాలను ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్ద నున్న హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడ విగ్రహాలను నీటిని నిమజ్జనం చేయడానికి వీలుగా క్రేన్ల ఏర్పాటు చేశారు. నాలుగు అడుగుల్లోపునున్న విగ్రహాలను అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి వద్దనున్న చెక్‌డ్యామ్‌లోనూ, హైవే వద్దనున్న బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లు చేశారు.

నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీశ్

ఉరేగింపులు మూడు రూట్లలో

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా మూడు రూట్లలో వెళ్లే విధంగా నిర్ణయించారు. అనంతపురం నగరంలో పాతూరు, విద్యుత్‌నగర్, నాయక్‌నగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు బసవన్నకట్ట మీదుగా సూర్యనగర్ రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకుని బయటకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఒకటవ రోడ్డు అటువైపు నుంచి వచ్చే విగ్రహాలు సైపుల్లా బ్రిడ్జి మీదుగా శ్రీకంతం సర్కిల్‌లో చేరి ఆర్ట్స్ కళాశాల వైపు నుంచి బయటకు వెళ్తాయి. రామనగర్ వైపు నంచి వచ్చే విగ్రహాలు అంబేద్కర్ బ్రిడ్జి మీదుగా సర్వజన ఆసుపత్రి నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా బయటకు వెళ్తాయి.

ట్రాఫిక్ ఆంక్షలు

నగరంలో నిమజ్జనం సందర్భంగా పెద్దఎత్తున ట్రాపిక్ జామ్ అయ్యే వీలున్నందున పెద్దపెద్ద వాహనాలు, బస్సులను దారి మళ్లిస్తున్నారు. నగరంలోకి రాకుండా బయట నుంచే వెళ్లాలని సూచిస్తున్నాయి. ఆయా మార్గాల్లో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు.

జిఎస్‌డబ్ల్యుఎస్ సర్వేను పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిఎస్‌డబ్ల్యుఎస్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిఎస్‌డబ్ల్యుఎస్, తదితర అంశాలపై ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు (జిఎస్‌డబ్ల్యుఎస్) అంశాలలో భాగంగా కౌశలం సర్వేకి సంబంధించి జిల్లాకు 1,14,145 మంది సర్వే చేపట్టాలని లక్ష్యం ఉందన్నారు. ఇందులో ఇప్పటివరకు 44,292 మంది సర్వే పూర్తి చేశారన్నారు. మిగిలిన దానిని కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం నగదు జమకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి తల్లిఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. మన మిత్ర క్యాంపెయిన్‌లో హౌస్ హోల్డ్ పెండింగ్‌కు సంబంధించి రోజువారి పురోగతిని పెంచాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తిగా నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, ఈ డిస్ట్రిక్ మేనేజర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, పాల్గొన్నారు.

ధ్వంసం అయిన శాసనలతో కూడిన పులిగుండ్లు

పురాతన శాసనాలు ధ్వంసం

చోద్యం చూస్తున్న పురావస్తు శాఖ

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి మండలంలో ఎన్నో పురాతన విగ్రహాలు, శాసనాలు ఉన్నాయి. కొందరు స్వార్ధపరులు వారి వ్యక్తిగత స్వార్ధం కోసం వాటిని ధ్వంసం చేస్తున్నారు. పురాత విగ్రహాల్లో బంగారు నాణేలు ఉంటాయన్న ప్రచారంతో కొందరు వీటిని ఎత్తుకెళ్లి పగలగొడుతున్నారు. ఇటీవల కుందుర్పిలో అతి పురాతన శాసనాలు, విగ్రహాలను అదే గ్రామానికి చెందిన టిడిపి మాజీ పట్టణ కార్యదర్శి మారెప్ప తొలగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తన ఇంటికి వెళ్లే రహదారికి అడ్డంగా ఉన్నాయంటూ జెసిబి సాయంతో పిలుగుండ్లపై కొలువదీరిన వివిధ శాసనాలు, విగ్రహాలను ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దకాలం నుంచి ఉన్న పురాతన పిలిగుండ్లను అక్కడి నుంచి తొలగించి గ్రామ చివరికి తరలించారు. సాధారణంగా వీటిని తొలగించాలంటే రెవెన్యూ, పురావస్తు శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం తొలగించిన వాటికి ఎలాంటి అనుమతులూ తీసుకోనట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు వాదోపవాదాలు చేసుకున్నారు. పురాతన శిలాశాసనాలను ఎలా తొలగిస్తారంటూ గ్రామానికి చెందిన కొందరు ప్రశ్నించారు. అధికారులు మాత్రం దీనిపై ఇప్పటికీ మౌనంగానే ఉంటున్నారు. ఇప్పటికైనా పురావస్తు, రెవెన్యూ శాఖల అధికారులు కుందుర్పి పులిగుండ్ల తొలగింపు వ్యవహారంపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకుందాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పోలీసుల నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనంను ప్రశాతంగా జరుపుకుందామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజలకు సూచించారు. ఆదివారం నగరంలో వినాయక నిమజ్జనం జరుగుతున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు, ప్రజలకు పలు అంశాలపై సూచనలు చేశారు. నగరంలో జరిగే శోభాయాత్రను ప్రజలంతా వీక్షించే విధంగా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. మండపాల నిర్వాహకులు కచ్చితంగా పోలీసులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసులు, ఇతర అధికారులు నిర్ణయించిన విధంగా రాచానపల్లి, పంపనూరు సమీపంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. డీజేలు ఇతర వాటి విషయంలో పోలీసులు సూచనలు పాటించాలన్నారు. నిమజ్జనం సమయంలో కాలువ వద్ద పిల్లలు, వద్దులు లేకుండా చేసుకోవాలన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన పెంచాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్డిపల్లి కెవికె ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి

పంటలకు అధిక ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పంచాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం స్థానిక జిల్లా వ్యవసాయ కార్యాలయంలో డివిజన్, మండల స్థానిక వ్యవసాయ అధికారులతో వివిధ పంటలపై శిక్షణ, సమీక్ష నిర్వహించారు. ముందుగా రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటలపై వివరించారు. ముఖ్యంగా వేరుశనగ పంట పూత దశ నుంచి ఊడలు దిగేదశలో ఉందన్నారు. కావున రైతులకు జిప్సం వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి పంటల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర కలుపు నివారణ చర్యలు, చీడపీడల నివారణపై వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా వివిధ పంటల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్పిక్ ఎరువుల కంపెనీ ప్రతినిధుల సమక్షంలో సుమారు 100 రైతు సేవాకేంద్ర సిబ్బందికి ఈ పాస్ మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలిఖాన్, పద్మజ, మీనల రవి, యల్లప్ప, వెంకటరాముడు, సత్యనారాయణ, ప్రతాప్, మండల వ్యవసాయ అధికారులు వెంకటకుమార్, పెన్నయ్య, శుభకర్, రామకృష్ణ, సోమశేఖర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ కార్యాలయ సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, వంశీ, శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి సచివాలయం వద్ద కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పిఎం కుసుమ్ యోజన పథకం కింద పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 103కు సంబంధించిన 50 ఎకరాల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం కుసుమ్ యోజన పథకం ద్వారా వ్యవసాయ సౌరశక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా సోలార్ పంపులు, గ్రిడ్ కనెక్ట్ చేసిన పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈప్రాంతంలో సోలార్‌ప్లాంట్ 12 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి భూమిని కొనుగోలు చేసినట్లు వివరించారు. తర్వాత చెన్నంపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పని తీరుపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ శేషాద్రి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ సొలమన్, మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు, డిఇఇ రఘు, ఎఇ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రూ.92,100కు వినాయక లడ్డు వేలం

ప్రజాశక్తి-యల్లనూరు :

మండల కేంద్రంలోని పాతపేట శివారులో గౌరమ్మ చావిడి వద్ద ఏర్పాటు చేసిన గణపతి లడ్డును వేలం వేయగా రూ.92.100 పలికింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వినాయకుని లడ్డుకు వేలంపాట నిర్వహించగా అంకిరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూ.92,100కు దక్కించుకున్నాడు.

రికార్డుల చెంత.. అవినీతి దందా..!

- ఇంజినీరింగ్ విభాగంలో రెవెన్యూ రికార్డులు
- అవుట్‌సోర్సింగ్ వర్కర్ చేతివాటం
- కమర్షియల్ కొళాయి కనెక్షన్ల ఆన్‌లైన్‌లోనూ అక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం వద్ద ఉండాల్సిన కమర్షియల్ కొళాయి కనెక్షన్ల రికార్డులు ఇంజినీరింగ్ పరిధిలో ఉంటున్నాయి. వీటిని ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అతని వద్ద ఉంచుకోవడంపై తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ రికార్డులతో సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి దందాలు కూడా చేస్తున్నట్లు సమాచారం. మూడేళ్ల క్రితం రెవెన్యూ విభాగం అవుట్‌సోర్సింగ్ వర్కర్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శల నేపథ్యంలో వారిని అక్కడి నుంచి తప్పించారు. పిహెచ్ వర్కర్లు ప్రజారోగ్య విభాగానికి వెళ్లి పారిశుధ్య పనులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వారిని రెవెన్యూ విభాగం నుంచి మార్చారు. పిహెచ్ వర్కర్ల జాబితాలో ఉన్న వారు వారికి బదులుగా బదిలీ వర్కర్లను విధుల్లో ఉంచుకున్నారు. ఇంజినీరింగ్ విభాగానికి వెళ్లిన రెవెన్యూ అవుట్‌సోర్సింగ్ వర్కర్లు వేర్వేరు విభాగాలను చేరుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో రెవెన్యూ విభాగంలో ఏ సిక్స్ గుమస్తా వద్ద విధులు నిర్వహించే వర్కర్ తనతో పాటుగా కమర్షియల్ కొళాయి కనెక్షన్ల రికార్డులను తీసుకెళ్లారు. అతను రికార్డులు తీసుకుని వెళ్తున్నా సంబంధిత గుమాస్తాలెవరూ కనీసం ప్రశ్నించకపోవడం గమనార్హం. నగరంలో 700కుపైగా ఉన్న కమర్షియల్ కొళాయి కనెక్షన్లను ఆన్‌లైన్ చేసేందుకు గతంలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసిన రమేష్ చర్యలు చేపట్టారు. కొంతమంది అవినీతి అధికారులు ఆయన చేసే ప్రయత్నాలకు మోకాలడ్డుపడ్డారు. వాటర్ వర్క్స్ విభాగంలో అప్పటి అవినీతి అధికారుల అండదండలతో అవుట్‌సోర్సింగ్ వర్కర్ కార్పొరేషన్ ఖజానాకు జమ కావాల్సిన నీటి పన్ను రాబడికి గండి కొడుతూ జేబులు నింపుకోవడం ప్రారంభించారు. ఇలా మూడేళ్లుగా సాగుతున్న కమర్షియల్ కొళాయి కనెక్షన్ల అక్రమ సంపాదన వ్యవహారం పలు సందర్భాల్లో వెలుగు చూసినా సంబంధిత ఉన్నతాధికారులు వాటిని తొక్కిపెడుతూ వచ్చారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇదే రకంగా కార్పొరేషన్‌కు రావాల్సిన నీటి పన్ను రాబడిని తగ్గించి అధికారుల సంతకాలు లేకుండా నీటి పన్ను నోటీసులు పంపిన వైనం వెలుగు చూసింది. దీనిపై విచారణ జరిపిన అధికారి సదరు అవుట్‌సోర్సింగ్ వర్కర్‌ను మందలించి హెచ్చరించారు. మూడు నెలల క్రితం ఒక న్యాయవాదికి నీటి పన్ను నోటీసులు అధికారుల సంతకాలు లేకుండా ఆ వర్కర్ పంపారు. దీనిపై సదరు న్యాయవాది కార్యాలయానికి వచ్చి అవుట్‌సోర్సింగ్ వర్కర్ అవినీతి కార్యకలాపాలను అందరు సిబ్బంది ముందు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇక పన్ను చెల్లింపు దారులతో సదరు అవుట్‌సోర్సింగ్ వర్కర్ తలపొగరుగా వ్యవహరిండంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అవుట్ సోర్సింగ్ వర్కర్ అవినీతి నిర్వాకం ఒకటి కార్యాలయంలో వెలుగుచూసింది. కొందరు ఉద్యోగుల వాటాల పంపకంలో వచ్చిన పేచీలతో అక్రమాల వ్యవహారం బహిర్గతం అయ్యింది. కార్పొరేషన్ ఖజానాకు జమ కావాల్సిన నీటి పన్ను రాబడిని తగ్గించి కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా తనకు వాటా ఇవ్వలేదని ఓ ఉద్యోగి కార్యాలయంలోనే ఘర్షణ పడినట్లు తెలుస్తోంది. తనకు వాటా రాకపోవటంతో ఆ అవుట్‌సోర్సింగ్ వర్కర్ చేస్తున్న నీటి పన్ను దందాను బహిర్గతం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతి అక్రమాలపై బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

అనంతపురం నగరంలో గృహ సముదాయాల కొళాయి కనెక్షన్లు 35,265 ఉన్నాయి. ఇందులో కార్పొరేషన్‌కు వసూలు కావాల్సిన నీటి పన్ను బకాయిలు రూ.8,65,03,319 కోట్లు ఉన్నాయి. నగరంలో కమర్షియల్ కొళాయి కనెక్షన్లు 800 పైగా ఉన్నాయి. ఈ కమర్షియల్ కొళాయి కనెక్షన్ల వివరాలు ఆన్‌లైన్ కాకపోవటం అక్రమార్కులకు సంపదను సృష్టిస్తోంది. ఇటీవల మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించి ఆస్తి, నీటి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. ఉన్నతస్థాయి అధికారి ఆదేశాలిచ్చినా సంబంధిత అధికారుల అడుగులు ఆ దిశగా పడకపోవడం గమనార్హం. కార్పొరేషన్ రెవెన్యూ విభాగం జారీ చేసే పన్ను నోటీసులో ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను కూడా కనబరిచి ఉంటుంది. ఆస్తి, నీటి పన్నుల బకాయిలను వసూలు చేసే బాధ్యత ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగంపై ఉన్నా సదరు అధికారులు దానిపై కనబరుస్తున్న శ్రద్ధ నామమాత్రమే అని చెప్పాలి. ఇదే అదనుగా అక్రమార్కులు యథేచ్ఛగా కార్పొరేషన్ నీటి పన్నులను వారి వ్యక్తిగత దారులకు మళ్లించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. నగరంలో విరివిగా అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం బిల్డింగ్ ప్లాన్‌లో ఫీజుల ద్వారా, నిర్మాణం పూర్తయిన అపార్ట్‌మెంట్లకు పన్నులు విధించేలా రెవెన్యూ విభాగం నుంచి చేపడుతున్న చర్యలు నామమాత్రమనే చెప్పాలి. వీటిన్నింటిపై సంబంధిత ఉన్నతాధికారులు మరింత దృష్టి సారించి అక్రమాలకు అడ్డుకట్టవేయడంతో పాటు కార్పొరేషన్ ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం : ఎస్కెయు విసి

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కెయు విసి బి.అనితను సన్మానిస్తున్న దృశ్యం

క్రీడల ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ బి.అనిత తెలిపారు. శనివారం స్థానిక ఎస్కెయులో విసి అధ్యక్షతన వ్యాయామ విద్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు సహాయం, విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో క్రీడా కార్యక్రమాల పురోభివృద్ధి వ్యూహాలపై చర్చించారు. అనంతరం జరగబోయే విశ్వవిద్యాలయ క్రీడల పోటీల వేదిక నిర్ణయించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆటలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడంలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ గ్రూప్-ఎ పోటీలను అనంతపురం ఎస్‌వి డిగ్రీ కళాశాల, గ్రూప్-బి పోటీలను కళ్యాణదుర్గం ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గ్రూప్-సి పోటీలను గుంతకల్లు ఎస్ఎస్‌జిఎస్ కళాశాల, అథ్లెటిక్స్, ఉమెన్ పోటీలను అనంతపురం ప్రభుత్వ కళాశాల అటానమస్‌లో, క్రికెట్ పోటీలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిర్వహించనున్నట్లు సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ బి.జెస్సీ తెలిపారు. ఈ సమావేశంలో రెక్టార్ జి.వెంకట్‌నాయుడు, సురేష్‌బాబు, రిజిస్ట్రార్ డి.ఆంజనేయులు, ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.లోకేష్, ఎస్కెయు అనుబంధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

నార్పల సమీపంలో బైకులు, కార్ల రేసింగ్

ప్రజాశక్తి-నార్పల

నార్పల సమీపంలోని హెచ్‌ఎల్‌సి కెనాల్ నుంచి పుట్లూరు మండలంలోని మడుగుపల్లి కణం వరకూ కార్లు, బైకుల రేసింగ్ నిర్వహిస్తున్నారు. వందలాది స్పోర్ట్స్ బైకులు, రేసింగ్ కార్లు నార్పల మీదుగా పుట్లూరు మండలానికి వెళ్తున్నాయి. ఈ విషయంపై ఎస్ఐ సాగర్‌ను వివరణ కోరగా కర్నాటక రాష్ట్రానికి చెందిన పలువురు కలెక్టర్ అనుమతితో పుట్లూరు మండలంలో కార్లు బైక్‌ల రేసింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నార్పల మీదుగా వాహనాలు వెళ్తున్నాయన్నారు. నేడు కూడా రేసింగ్‌లు కొనసాగుతాయన్నారు. ఇకపోతే రేస్ వాహనాలు అతివేగంతో వెళ్తుండటతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలోనే పుట్లూరు మండలానికి వెళ్తున్న వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా రేసింగ్‌లో పాల్గొనడానికి వచ్చిన స్పోర్ట్స్ బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైనట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలో రేసింగ్ వాహనాల వేగాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

పోలీసులపై దాడి చేస్తేనే అరెస్టు చేశాం

డీఎస్పీ వెంకటేశులు

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనంలో పోలీసుల కాలర్ పట్టుకుని దాడి చేయడంతోనే యువకులను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. శనివారం రాప్తాడులోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతిమలను నిమజ్జనానికి తరలిస్తుండగా గ్రామస్తులను దృష్టిలో ఉంచుకుని త్వరగా నిమజ్జనానికి వెళ్లాలని ఎస్సీ కాలనీకి చెందిన యువకులకు పోలీసులు సూచించారన్నారు. అయితే ఇద్దరు యువకులు పోలీసులపై రంగులు చల్లడమే కాకుండా పోలీసుల కాలర్ పట్టుకుని దాడికి యత్నించారన్నారు. దీంతో ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకోవడానికి యత్నించారన్నారు. దీంతో మహిళలు కొందరు అడ్డుకున్నారన్నారు. అంతేతప్ప పోలీసులు ఉద్దేశ పూర్వకంగా ఎవరిపైనా దాడి చేయలేదన్నారు. చెన్నంపల్లి అత్యంత సమస్యాత్మకమైన గ్రామం కావడంతో గొడవలు జరగకుండా పోలీసులు త్వరగా నిమజ్జనం చేయాలని సూచించారు తప్ప.. దళితులపై దాడి చేయాల్సిన అవసరం పోలీసులకు లేదన్నారు. ఘటనపై విచారణ చేస్తున్నామన్నారు. అయితే కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో అబద్ధపు ప్రచారాలు, అసత్యాలు పెడుతున్నారన్నారు. పోలీసుల ప్రతిష్టను దెబ్బతినే విధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుత్తి సబ్ జైలు తనిఖీ

సబ్ జైలు వంట గదిని పరిశీలిస్తున్న న్యామూర్తి ఎన్.రాజశేఖర్

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రత్యేక ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవా సమితి జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్.రాజశేఖర్ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గుత్తి ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి.సాదుబాబు ఆధ్వర్యం లో పలు రికార్డులు, వంటగది, నిత్యావసరాలు ఉంచే స్టోర్ గది, ఖైదీల బ్యారెక్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై విచారించారు. అనంతరం ఖైదీలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఖైదీలను ఆరాతీశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. జైలు ఆవరణలో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలని జైలు సూపరింటెండెంట్ వడ్డే మహేశ్వరుడుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలర్ మహేశ్వరుడు, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-తాడిపత్రి

వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పట్టణ సిఐ సాయిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నుంచి కడప వెళ్లే వాహనాలను రైల్వే ఫ్లైఓవర్ దగ్గర ఉన్న శివుడి విగ్రహం నుంచి ఆటోనగర్ బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. అనంతపురం నుంచి తాడిపత్రి మీదుగా నంద్యాల వెళ్లే వాహనాలను కృష్ణదేవరాయ విగ్రహం నుంచి మున్సిపల్ బైపాస్ రోడ్డు మీదుగా చుక్కలూరు బ్రిడ్జి నుంచి సజ్జలదిన్నె క్రాస్ బుగ్గ మీదుగా వెళ్లాలన్నారు. కడప నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలను ఐశ్వర్య విలాస్ - ఆటోనగర్ మీదుగా కృష్ణదేవరాయ సర్కిల్, మున్సిపల్ బైపాస్ రోడ్డు నుంచి చుక్కలూరు బ్రిడ్జి, సజ్జలదిన్నె క్రాస్ బుగ్గ మీదుగా వెళ్లాలన్నారు. ఈ ఆంక్షలు ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఉంటాయన్నారు. ప్రజలు, వాహనదారులు గమణించి సహకరించాలని కోరారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు బకాయి ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నగరంలోని డ్వామా కార్యాలయంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పీడీ సలీంబాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 9, 10 వారాల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో పండగ పూట కూడా శ్రామికులు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చేసేది లేక కొంతమంది ప్రయివేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు అప్పులు తీసుకుని కుటుంబాలు గడుపుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించి శ్రామికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల విజేతకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

పాండిచ్చేరిలో మెడికోలకు నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన అనంతపురం వైద్య కళాశాల విద్యార్థినిని అభినందించారు. అనంత వైద్య కళాశాల అనాటమీ విభాగం ప్రథమ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థిని డాక్టర్ కెవై రూక్షణ 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో సిల్వర్ మెడల్, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. దీంతో స్థానిక మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా ఛాంబర్‌లో రూక్షణను అభినందించారు. ఈ కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి ఎస్‌ఉమామహేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్లు నరేంద్రనాయక్, ఎస్.అహ్మద్‌పీర్, వాల్మీకి పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ షహజీర్, ట్యూటర్లు పునర్జీవన్ కుమార్, ఓతూరు భాను, అనాటమీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

ప్రజాశక్తి-గుంతకల్లు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా పూజలందుకున్న వినాయకులను శనివారం ఘనంగా నిమజ్జనానికి తరలించారు. ఇందులో భాగంగా స్థానిక రైల్వే క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రతిమకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని, మండల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టిడిపి నాయకులు శ్రీనివాసులు, పట్టణ వినాయక ఉత్సవ సమితి సభ్యులు గోపా జగదీష్, తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోత్తంగా పూజలు చేశారు. అక్కడి నుండి ప్రధాన రహదారుల గుండా మార్కెట్ యార్డు సమీపంలోని వినాయకుడి ఘాట్‌కు తరలించి నిమజ్జనం చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు పరిరక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌మహమ్మద్, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ అలీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



గణనాథులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఘనంగా పల్లె ఉమకు నివాళి

జనసంద్రంగా మారిన పల్లె వ్యవసాయ క్షేత్రం-భారీగా తరలివచ్చిన ప్రముఖులు

పల్లె ఉమాకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం

మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి కీశే పల్లె ఉమాకు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి సమీపంలో ఉన్న పల్లె వ్యవసాయ క్షేత్రంలోని ఘాట్ వద్దకు పెద్దఎత్తున ఎమ్మెల్యేలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు, పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. అనంతరం పల్లె రఘునాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పివికెకె ఇంజినీరింగ్ కళాశాలల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వియాన్ , వన్యా, పల్లె వియ్యంకులు, కేరళ మాజీ డిజిపి శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి, తదితరులు ఉమా ఘాట్‌కు పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం పల్లె కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె ఉమా జీవిత చరిత్రకు సంబంధించిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్దఎత్తున రక్తదానం చేశారు. తర్వాత సిబ్బంది, కార్మికులకు వస్త్రదానం చేశారు. వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, ఎంపి పార్థసారథి, సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అనంతపురం మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, టిడిపి క్రిస్టియన్ జిల్లా అధ్యక్షులు స్వామి దాస్, ఎపిపిఎస్‌పి మాజీ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఛాన్సలర్లు హుసేన్‌రెడ్డి, జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య, పెద్దఎత్తున టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, కాంగ్రెస్, బీఎస్పీల నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : డిఎంహెచ్‌ఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి

ప్రజాశక్తి అనంతపురం

జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేసినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని డిఎంహెచ్‌ఒ ఛాంబర్‌లో జిల్లాస్థాయి గర్భస్థ పిండలింగ నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా భ్రూణహత్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ సెంటర్లను అనుమతి లేకుండా నడిపితే నిబంధన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు ఆకాశవాణి కేంద్రం ద్వారా సందేశాత్మకంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే అనంతపురం ప్రధాన కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08554- 288234 ఫోన్ నెంబర్ ద్వారా ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు యుగంధర్, అనుపమ, నారాయణస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణుమూర్తి, సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు రవికుమార్, స్త్రీవ్యాధి నిపుణులు పద్మశ్రీ, పాథ్యాలజీ నిపుణులు దీప్తి, ఆర్‌డిటి ప్రతినిధి డాక్టర్ దుర్గేష్, రెడ్స్ సంస్థ అనిత, ఐసిడిఎస్ వెంకటేశ్వరి, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు మాని..అభివృద్ధిపై చర్చకు రండి

వైసిపి నాయకుల సవాల్

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గ టిడిపి నాయకులు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యపై వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై చర్చకు రావాలని వైసిపి సీనియర్ నాయకులు సవాల్ విసిరారు. శనివారం నగరంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఎప్పుడిస్తారని ప్రశ్నించిన వైసిపి నాయకులు రంగయ్యపై టిడిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం బాధాకరమన్నారు. 300 కిలోమీటర్లు ఉన్న కుప్పంకు నీళ్లు తీసుకెళ్లి కేవలం 24 కిలోమీటర్లు దూరంలో ఉన్న కళ్యాణదుర్గానికి ఎందుకు నీరు తీసుకురాలేక పోయారని ప్రశ్నించడం తప్పా..? అని నిలదీశారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని లేనిపక్షంలో సరైన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, రూరల్ కన్వీనర్ గోళ్ల సూరి, కంబదూరు, బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల కన్వీనర్లు హనుమంతురాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్, రాయుడు, మైనార్టీ నాయకుడు షేక్షావలి, సీనియర్ నాయకులు బికి హరి, గోపారం శ్రీనివాసులు, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మురళి, రామాంజనేయులు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పీల్ చేసుకున్న వికలాంగులందరికీ పింఛన్

పుట్లూరు : అప్పీల్ చేసుకున్న దివ్యాంగులందరికీ వచ్చేనెల 1వతేదీన ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేయనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 8 నెలలుగా పింఛన్ల రీ వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. పూర్తయిన వారిలో అర్హులు ఎవరు.. అనర్హులు ఎవరు తెలియజేశామన్నారు. ఇంకా అనర్హుల్లో ఎవరైనా అర్హులమని భావిస్తే అప్పీల్ చేసుకునే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు. అలాంటి వారి మీ పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30 రోజుల్లోగా వైద్యపరమైన పరిశీలన పూర్తయిన తర్వాత తిరిగి పెన్షన్ పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తోందన్నారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రతి అర్హుడికీ పింఛను చేరేలా చూస్తున్నామన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గంలో వికలాంగులు అందరికీ వచ్చేనెల 1వతేదీన ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం నోటీసులు అందుకున్న వికలాంగులు మీ పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పుట్లూరు : మండలంలో దివ్యాంగులకు సంబంధించి ఒక్క పింఛన్ కూడా తొలగించలేదని ఎంపిడిఒ అలివేలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీ వెరిఫికేషన్‌లో భాగంగా నోటీసులు వచ్చిన వారందరూ ఎంపిడిఒ కార్యాలయంలో అప్పీల్ చేసుకోవాలన్నారు. రీ వెరిఫికేషన్ వచ్చేంత వరకూ 1వతేదీన వారందరికీ పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత కెసిజిహెచ్

రన్నర్‌గా జ్ఞానభారతి హైస్కూల్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బివిఎం స్పోర్ట్స్ ప్రీమియర్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ లెవల్ క్రికెట్ టోర్నీ విజేతగా కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల విజయకేతనం ఎగురవేసింది. రన్నర్‌గా జ్ఞానభారతి హైస్కూల్ జట్టు నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కెసిజిహెచ్, జ్ఞానభారతి హైస్కూళ్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ ఎంచుకున్న కెసిజిహెచ్ 15 ఓవర్లలో 101 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జ్ఞానభారతి జట్టు 91 రన్నులకే ఆల్‌అవుట్ అయింది. కేసీజీహెచ్ జట్టులో బౌలర్ ఆసన్ మూడు వికెట్లు తీయగా బ్యాట్స్‌మెన్ రుషి 31 బంతుల్లో 32 పరుగులు చేసి విజయంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం రన్నర్, విన్నర్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమేష్, కుళ్లాయప్ప, హెచ్‌ఎంలు గంధం శ్రీనివాసులు, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

పండుగ సందడి..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వినాయక చవితి పండుగ సందడి అంతటా కోలాహలంను నింపింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాడవాడలా వినాయక చవితి పండుగ సంబరాలు కనిపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులపాటు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి నిమజ్జనాలు పూర్తయ్యాయి. అనంతపురం నగరంలో మాత్రం ఐదు రోజులకు నిమజ్జనం జరగనుంది. పెద్దఎత్తున విగ్రహాల ఏర్పాటు జరిగాయి. ఇందులో ఎక్కడా అవాంఛానీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. ఒకటి, రెండు చోట్ల అపశృతులు చోటు చేసుకున్నాయి. పుట్లూరులో విద్యుత్ షాక్‌తో వినాయక మంటపం వద్ద ఒక యువకుడు మృతి చెందారు. ఇక బుక్కరాయసముద్రంలో పోలీసులు, దళితుల మధ్య పెద్దఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. ఊరేగింపును అడ్డుకునే క్రమంలో జరిగిన ఘర్షణలో దళితులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఇక అనంతపురం నగరంలో ఆదివారం నాడు నిమజ్జనం జరగనుంది. నగరంలో వందల సంఖ్యలో మంటపాలున్నాయి. ఈ విగ్రహా నిమజ్జన సమయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ ఆంక్షలతోపాటు, తగిన సూచనలను నిర్వాహకులు జిల్లా యంత్రాంగం చేసి ఉంది. మరోవైపు నిర్వాహకులు ప్రతి మంటపం వద్ద భారీ ఎత్తునే ఏర్పాట్లు చేసి ఉండటం గమనార్హం. విద్యుత్ దీపాలంకరణలతోపాటు, వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి డిజెలతోపాటు, డప్పులను భారీగా సమకూర్చుకుంటున్నారు. మొత్తంగా ఈవారంలో ఎక్కడ చూసినా వినాయక చవితి సందడి వాడవాడల్లో కనిపించింది.

ఉమ్మడి జిల్లాలో బార్ లైసెన్సుల కోసం టెండర్లు జరిగాయి. ఈ టెండర్లలో పాల్గొన్న వారి సంఖ్య పెద్దగా లేకపోవడంతో కొన్నింటి మరోమారు టెండర్లు నిర్వహించాలని తలపెట్టారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. డీఎస్సీ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. గడిచిన మూడు రోజులుగా ఈ ప్రక్రియ సాగింది. అభ్యర్థులకు మెసేజ్ రావడంలో కొంత సమస్య ఎదురైనప్పటికీ దాదాపుగా సజావుగానే ప్రక్రియ కొనసాగింది. గత వారంలో అనంతపురం జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కొన్ని అంశాలే చర్చకు వచ్చినట్టు విమర్శలున్నాయి. వర్షాభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, గతేడాది పంటనష్టానికి సంబంధించిన పరిహారం ఎప్పుడు ఇస్తారన్న అంశాలేవీ ఇందులో చర్చ జరగలేదు. సాగునీటిపై చర్చ జరిగినప్పటికీ ప్రధానంగా హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పుపైనే జరిగింది. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం జరుగుతుందని మంత్రులు చెప్పారు. పరిశ్రమలు కూడా జిల్లాకు తీసుకొస్తామని ప్రకటించారు. ఇదిలాగుంటే ఖరీఫ్ ముగుస్తున్నా ఐఎబి సమావేశం మాత్రం ఇప్పటికీ పూర్తవలేదు. ఖరీఫ్‌కే ఈ ఏడాది నీళ్లు అని అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఆయకట్టు దిగువనున్న మిడ్‌పెన్నార్ దక్షిణ, ఉత్తర కాలువల కింద ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. సాగునీరు అధికంగా వచ్చిన సమయంలోనూ నీటి నిర్వహణపై సరైన స్పష్టత లేకుండా ఉండటం పట్ల రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

డిఇఇ దాక్షాయిని సరెండర్

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న దాక్షాయిని ఇఎన్‌సి కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఇంజినీరింగ్ అధికారులు లేఖ పంపారు .ఆమె స్థానంలో టిడ్కో నుంచి పదోన్నతిపై ఎలక్ట్రికల్ డిఇఇ స్రవంతిని నియమిస్తూ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు.

హిందీ పండిట్‌గా జి.అమృతవాణి

ఉరవకొండ : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో విడపనకల్లు మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామానికి చెందిన జి.అమృతవాణి హిందీ పిజిటి జోనల్ పోస్టుకు ఎంపికైంది. సోషల్ వర్కర్ జి.శంకరయ్య, భార్య లక్ష్మీనరసమ్మ కుమార్తె అమృతవాణి మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. ఈనేపథ్యంలో డీఎస్సీ ఫలితాల్లో ణి హిందీ పిజిటి జోనల్ పోస్టుకు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులకు మెరుగైన బోధన చేసి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

చెక్‌పోస్టు వద్ద మాట్లాడుతున్న తహశీల్దార్

బొమ్మనహాల్ : కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించినట్లు తహశీల్దార్ మున్నివేలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా. కర్ణాటకకు తరలించకుండా అరికట్టేందుకే చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకు అవసరమైన ఎరువులు ఉన్నాయని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, జమేదార్ కమల్ బాషా, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీలో ఏడుగురికి వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు

పామిడి : మెగా డీఎస్సీ-2025 ఫలితాల్లో పామిడి మండలానికి చెందిన ఏడుగురు వ్యాయామ ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. వంకరాజుకాలవ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు నరసింహ, సురేష్, చంద్ర వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం విశేషం. అలాగే పామిడి గ్రామానికి చెందిన వెంకటేష్, మహేష్, పామిడి శ్రీచైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పని చేసిన హనుమేష్, తంబళ్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఎదురూరు గ్రామానికి చెందిన హుస్సేన్ వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

ఎమ్మెల్యే, ఎంపిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపి అంబికా లక్ష్మీనారాయణపై టిడిపికి చెందిన కొందరు కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోవర్ధన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎక్కడైనా రెండు వర్గాలు ఉండటం సహజమే అని.. అయితే ఆ పంచాయతీని బట్టి నిర్ణయం తీసుకుని ఉంటారన్నారు. కేవలం కొందరి స్వార్థం కోసం పార్టీని రోడ్డుకు లాగడం మంచిది కాదన్నారు. ఏదైనా సమస్యల ఉంటే పార్టీలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.

6 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

అనంతపురం : వచ్చేనెల 6వతేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ ఎ.హరికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాతరేషన్ కార్డుల స్థానంలో నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎటిఎం కార్డుల సైజులో స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్‌కార్డులు ద్వారా రేషన్ సరుకులు తెచ్చుకోవడంతోపాటు గుర్తింపు కార్డులుగా కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

జిల్లాకు 1,354 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం : జిల్లాలోని ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న రైల్వే రేక్ పాయింట్‌కు శనివారం 1,354 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి. ఈమేరకు ఆయా ఎరువులను విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా యూరియా, ఇతర ఎరువులు ఏమేరకు వచ్చాయో రేక్ ఆఫీసర్ జిఎం అల్తాఫ్ అలిఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేక్ పాయింట్ వచ్చిన ఆర్‌సిఎఫ్ కంపెనీ యూరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా 500 మెట్రిక్ టన్నుల యూరియాను లారీకి ఎన్ని టన్నులు లోడ్ చేస్తోంది ప్రత్యక్షంగా పరిశీలించారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

మృతిచెందిన రాము

బెలుగుప్ప : ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. కణేకల్ మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన వడ్డే హనుమంతు కుమారుడు వడ్డే రాము (36) వినాయక చవితి పండుగకు అత్తగారి ఊరైన శెట్టూరు మండలం ఐదుకల్లుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే బెలుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి క్రాస్ వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య వడ్డే లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బుక్కరాయసముద్రం : మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామ శివారులో నరసమ్మ ఆలయం వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే పోలీసులు సకాలంలో స్పందించడంతో బతికి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. దండువారిపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో కుటుంబ కలహాల కారణంగా నరసమ్మ ఆలయం వద్దకు ఆటోలో వచ్చి వేపచెట్టుకు ఉరేసుకునేందుకు యత్నించాడు. గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. అయినా వినలేదు. వెంటనే సిఐ పుల్లయ్యకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ శీను ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తర్వాత నారాయణస్వామిని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నార్పల : మండల కేంద్రంలోని సిపిఐ కాలనీలో నివాసం ఉండే హనీఫ్ కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు.. బంధువులు వెంటనే నార్పల ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా బాధితుడిని అనంతపురం తరలించేందుకు 108 కోసం ప్రయత్నించగా అంబులెన్స్ రాకపోవడంతో ఆటోలో తరలించాల్సి వచ్చింది.

మహిళపై కొడవలితో దాడి

నార్పల : మండలం పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో జమీలపై లక్ష్మీరెడ్డి అనే వ్యక్తి కొడవలితో దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. జమీలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జమీల భర్త మరణించడంతో కొద్దికాలంగా వెంకటాంపల్లిలోని తండ్రి నన్నేసాబ్ వద్ద ఉంటోంది. అయితే రాజారెడ్డి కుమారుడు లక్ష్మీరెడ్డి పలుసార్లు జమీలతో దురుసుగా ప్రవర్తించి గొడవలు పడినట్లు తెలిపారు. ఈనేపథ్యంలోనే శనివారం కూడా జమీలతో దురుసుగా ప్రవర్తించడంతో మాటామాట పెరిగింది. దీంతో కోపద్రిక్తుడైన లక్ష్మీరెడ్డి ఆమెపై గొడ్డలితో దాడి చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.



ముత్యాల గణపతి ప్రతిమ తయారీ బృందంతో ఎంపిడిఒ

ముత్యాల గణపతి ప్రతిమ తయారీ బృందానికి అభినందనలు

ఉరవకొండ : పర్యావరణ హితం కోరుతూ ముత్యాల గణపతి ప్రతిమను తయారు చేసి జిల్లాకే ఆదర్శంగా నిలిచిన ముత్యాల గణపతి కమిటీ బృందాన్ని ఉరవకొండ ఎంపిడిఒ రవిప్రసాద్ అభినందించారు. ఈమేరకు జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల గణపతి ప్రతిమ తయారు చేసిన బాల గణపతి కమిటీ నిర్వాహకులు శీనా, హరి, ఉదయ్, మోహన్, జయ, నరేష్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, వ్యాపారవేత్త బాలరాజు, నిస్వార్థ మహిళా ప్రతినిధి సునీత, కుళ్లాయప్ప, వలి, ఎన్‌టిఆర్ కాలనీ, అంబేద్కర్ నగర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల యూత్ కన్వీనర్‌గా పూల రంగనాథ్

బుక్కరాయసముద్రం : వైసిపి మండల యూత్ కన్వీనర్‌గా పూల రంగనాథ నియమితులయ్యారు. ఇందులో భాగంగా మండల వైసిపి నాయకులు ఆయన్ను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా పూల రంగనాథ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే శైలజనాథ్, ఆలూరు సాంబశివారెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పార్వతి, పూల నారాయణస్వామి, ఆదినారాయణ, పూల రవిప్రసాద్, పవన్, సాయి, పూల లక్ష్మీనారాయణ, బాలాజీ, కొండా, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

యాడికి : మండల కేంద్రంలో మృతిచెందిన అనాథలకు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మెయిన్‌బజార్‌లో ఉన్న తీరు మిద్దె వద్ద ఓ వ్యక్తి మృతిచెందాడు. అలాగే పాత పోలీస్‌స్టేషన్ వద్ద నివాసం ఉంటున్న కరణం సుబ్బారావు అనారోగ్యంతో మృతిచెందారు. వీరికి ఎవరూ లేకపోవడంతో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. అంత్యక్రియల ఖర్చుకు మాజీ ఎంపిటిసి ఆది సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేష్, హెడ్ కానిస్టేబుల్ శివశంకర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, సాయివరపు నాగరాజు, బడి గింజల వేణు, కావలి సుధాకర్ (వెంకటాంపల్లి), బోయ అశోక్‌కుమార్, పాల్గొన్నారు.

పల్లె ఉమకు నివాళి

గుత్తి : స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శ్రీబాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ కరస్పాండెంట్, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమాకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ యల్లప్పతో కలిసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్‌ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె ఉమకు నివాళులర్పిస్తున్న శ్రీసాయి కళాశాల సిబ్బంది

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఉరవకొండ

భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వజ్రకరూరు తహశీల్దార్ నరేష్‌కుమార్ సూచించారు. మండలంలోని చాబాల గ్రామంలో సర్పంచు జగదీష్ అధ్యక్షతన శనివారం పౌర హక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య అసమానతలు తొలగిపోయినప్పుడే సామాజిక వివక్ష తొలగిపోతుందన్నారు. వ్యక్తిని వ్యక్తిగా గౌరవించే సమాజం రావాలన్నారు. అప్పుడే పౌర హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. ఇవన్నీ జరగాలంటే ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సురేంద్ర, రామ్మూర్తి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మున్సిపాలిటీ దొడగట్ట గ్రామ ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కులపై వక్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ కుళ్లాయప్ప, టౌన్ ఎస్ఐ చైతన్య, డివిజినల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, హాస్టల్ వార్డెన్ నాగరాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవంలో వక్తలు

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమానత్వం సాధ్యమని తహశీల్దార్ సుమతి సూచించారు. శనివారం మండలంలోని పడమటి కోడిపల్లి ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రంగనాయకులు, ఆర్ఐ నాగిరెడ్డి, సబ్ డివిజినల్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, వీఆర్వో లక్ష్మన్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, అంగన్వాడీ కార్యకర్త యశోద, ఆశా కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న అధికారులు

బెళుగుప్పలో హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెళుగుప్ప : మండల పరిధిలోని తగుపర్తి గ్రామంలో ఉన్న ఆర్డీటీ కార్యాలయంలో శనివారం పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శివ, తగ్గుపర్తి సర్పంచు దబ్బర మౌనిక, ఎంపిటిసి పుష్పావతి, వీఆర్వో ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శంకర్, ఎపిఒ మురళీకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు రాధాకృష్ణ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు దబ్బర వెంకట నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామాంజనేయరెడ్డి

యల్లనూరు : మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను ఎస్ఐ వివరించారు. తర్వాత సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ట్రైనీ ఎస్ఐ సురేష్, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : అనారోగ్యంతో మృతిచెందిన పులికల్లు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కుటుంబానికి వైసిపి నాయకులు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మండల కన్వీనర్ గొల్ల సూర్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మున్సిపాలిటీ అధ్యక్షుడు దొడగట్ట మురళి, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి బోరంపల్లి రామిరెడ్డి, బీసీ సెల్ మోహన్, మండల యూత్ అధ్యక్షుడు మల్లిగొల్ల తిమ్మరాజు, చిన్నచిత్తయ్య, చాకలి సురేష్, తిమ్మారెడ్డి, బొజ్జప్ప, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

గణాంక శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎం. పర్వతప్ప

నియామకపత్రం అందుకుంటున్న పర్వతప్ప

ఉరవకొండ : అర్థ గణాంక శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా వజ్రకరూరు మండలం సహాయ గణాంక అధికారి ఎం.పర్వతప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని అర్థ గణాంక శాఖ ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో జిల్లా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పర్వతప్పతోపాటు ఉపాధ్యక్షులుగా యాడికి మండలం ఎఎస్ఒ శ్రీనివాస్ నాయక్, కార్యదర్శిగా అనంతపురం మండలం ఎఎస్ఒ కళ్యాణి, సహాయ కార్యదర్శిగా ఆత్మకూరు మండలం ఎఎస్ఒ మమత, ట్రెజరర్‌గా అనంతపురం మండలానికి చెందిన డివైఎస్ఒ లక్ష్మీజిని ఎన్నుకున్నారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన

నార్పల : మండల పరిధిలోని నర్సాపురం సమీపంలో జరుగుతున్న హెచ్చెల్సీ పనులను డిప్యూటీ కలెక్టర్ హెచ్.ఆనంద్ శనివారం పరిశీలించారు. అనంతరం మండలంలో సాగుతున్న ఉపాధి హామీ పనులపై ఎంపిడిఒతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మమతాదేవి, చెన్నంపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆలం నాగార్జున, నార్పల సాగునీటి సంఘం అధ్యక్షుడు గవ్వల పరంధామ, సర్వేయర్ బాషా, ఎపిఒ ఎర్రమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించొద్దు

కౌన్సిల్ మీట్‌లో సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో గృహనిర్మాణ పథకం కింద పక్కా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులను నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయొద్దని మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, బండి అజయ్, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు కోరారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిలప్ప అధ్యక్షతన శనివారం రాయదుర్గం పురపాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ అధికారులు పక్కా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రెండవసారి కూడా నోటీసులు జారీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణ మొత్తాన్ని పెంచకపోగా మంజూరైన మొత్తంతో పక్క ఇల్లు నిర్మించుకుంటుంటే రెండోసారి నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందుకు ఛైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ మంగళ, బుధవారాల్లో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి తహశీల్దార్, గృహ నిర్మాణ సంస్థ అధికారులకు సందేహాలను నివృత్తి చేయిస్తామన్నారు. అలాగే పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ వద్ద పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడంతోపాటు ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పురపాలక సంఘం ఆదాయాన్ని పొందవచ్చని సభ్యుడు అజయ్ సూచించారు. కాగా పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని సభ్యురాలు ప్రశాంతి, కోతుల సమస్య కూడా తీవ్రంగా ఉందని సభ్యురాలు లావణ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. వీటితోపాటు అనేక సమస్యలను సభ్యులు లేవనెత్తారు. అనంతరం అజెండాలోని అన్నిఅంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ సురేష్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో సమస్యలను లేవనెత్తుతున్న సభ్యులు